క్లుప్తంగా

భర్త వేధింపులపై ఫిర్యాదు

పాలకొండ రూరల్: మండల పరిధిలోని ఎస్.కె.రాజపురం గ్రామానికి చెందిన వి.మీనాక్షి తన భర్త, ఆడపడుచు తనను తరచూ వేధిస్తున్నారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పాలకొండ ఎస్‌ఐ బి.శివప్రసాద్ తెలిపారు.

నియామకపత్రాలు అందజేత



నియామకపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ పాలిటెక్నికల్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన పలువురు విద్యార్థులకు మంగళవారం నియామకపత్రాలు అందజేశారు. జాబ్‌లు పొందిన వారిని ఆదర్శంగా తీసుకుని, మిగతా విద్యార్థులు కూడా ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ ఆకాంక్షించారు.

చురుగ్గా పూడికతీత పనులు



కాలువల్లో పూడికలు తీయిస్తున్న పంచాయతీ విస్తరణాధికారి చంద్రశేఖర్

కురుపాం: స్థానిక పట్టణంలోని పలు కాలువల్లో పూడికతీత పనులు చురుగ్గా చేపట్టారు. పంచాయతీ విస్తరణాధికారి చంద్రశేఖర్, సర్పంచ్ గార్ల సుజాత పర్యవేక్షణలో జేసీబీతో కాలువల్లో పేరుకుపోయిన పూడికలు మంగళవారం తొలగించారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు కాలువల ద్వారా ప్రవహించేలా చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



నవధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: మండలంలోని కుశిమి గ్రామ రైతు భరోసా కేంద్రంలో నవధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ యాంకర్ నరేష్ మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేసుకుంటే నేల సారవంతమై, తద్వారా పంటలు బాగా పండుతాయన్నారు. చీడపీడలు, తెగుళ్లను కూడా పంటలు తట్టుకుని, అధిక దిగుబడినిస్తాయన్నారు. రైతులంతా నవధాన్యాలు సాగు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం: వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశాకార్యకర్తలతో సమావేశమైన ఆమె ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు.

రూ.10 వేల పెన్షన్ మంజూరు



బాధితునికి పెన్షన్ నగదు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఇదే పట్టణానికి చెందిన ముద్దాడ పుష్పనాథంకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల పెన్షన్‌ను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి

భామిని: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలపై మంగళవారం అవగాహన కల్పించారు. వైద్యాధికారి ఫణికుమార్ మాట్లాడుతూ మే 5వ తేదీ వరకు మిడ్ వైఫెరీ వీక్ పాటించి, ప్రతీ ఆశాకార్యకర్త ఇంటింటికీ వెళ్లి, సాధారణ ప్రసవాలపై చైతన్యం కలిగించాలన్నారు. సాధారణ కాన్పు ద్వారా తక్కువ రక్తస్రావమై, కాన్పు వెంటనే తల్లి పాలు పిల్లలకు పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కరరావు, హెచ్‌వీ గౌరీశ్వరి, సబ్ యూనిట్ అధికారి అప్పారావు పాల్గొన్నారు.



భామిని: బాలేరులో గ్రామదేవత పండగ సందడి



వీరఘట్టం: విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి ఆలయం



గుమ్మలక్ష్మీపురం: కలశాలలతో పవిత్ర నదీజలాలు తీసుకువస్తున్న మహిళలు



వీరఘట్టం: బోయిడు ఇంటి వద్ద కొలువుదీరిన అమ్మవారి ఘటాలు, పాలజంగిడి

వైభవంగా పైడితల్లి అమ్మవారి మహోత్సవాలు

- అమ్మవారి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- నేడు ఘటాల ఊరేగింపు, పాలజంగిడి తిరువీధి
- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఏర్పాట్లు

వీరఘట్టం: పట్టణంలో గత రెండు రోజులుగా పైడితల్లి అమ్మవారి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత ఈ పండగ చేస్తుండడంతో వృత్తి, ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన పట్టణ వాసులంతా పట్టణానికి తరలివచ్చారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది. ఆలయం, ప్రధాన రోడ్లు, వీధులు విద్యుత్ వెలుగుల్లో సరికొత్త శోభను సంతరించుకున్నాయి. మంగళవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఘటాలు, పాలజంగిడి పట్టణ వీధుల్లోకి బుధవారం రానున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు బోయిడు(అమ్మవారి పూజారి) ఇంటి దగ్గర పాలజంగిడి బయలుదేరి, ఆంజనేయ కాలనీ, బంగ్లా కాలనీ, బీసీ కాలనీ, రెల్లి, గొల్ల వీధుల్లో ఊరేగుతాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆయా వీధుల్లోనే అమ్మవారి ఘటాల తిరువీధి ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



గరుగుబిల్లి: దళాయివలసలో రేగాలమ్మ సిరిమానోత్సవ సందడి

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వేపారమ్మ, నూకాలమ్మ దేవతలకు భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం మహిళలంతా కలశాలలతో పవిత్ర నదీజలాలు తీసుకువచ్చి, అమ్మవార్లకు చల్లదనం చేశారు. ఏటా పంటలు బాగా పండి, గ్రామస్తులంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వేడుకున్నారు.



వీరఘట్టం: ప్రత్యేకాలంకరణలో పైడితల్లి అమ్మవారు

బాలేరులో గ్రామదేవత సంబరాలు..

భామిని: మండలంలోని బాలేరు గ్రామంలో గ్రామదేవత సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా కలశాలలతో పవిత్ర నదీజలాలు తీసుకువచ్చి, గ్రామదేవత పాతపట్నం అమ్మవారికి చల్లదనం చేశారు. అనంతరం పసుపు, కుంకుమ, కోళ్లు, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. నిత్యం సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకున్నారు.



పాలకొండ రూరల్: అమ్మవారి ఘటాల ఊరేగింపులో భక్తజనం

ముగిసిన అసిరితల్లి ఉత్సవాలు..

పాలకొండ రూరల్: మండలంలోని కొండాపురం గ్రామంలో గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న అసిరితల్లి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దాదాపు 64 ఏళ్ల తర్వాత ఈ వేడుకలు చేయడంతో పెద్దఎత్తున చుట్టాలు, బంధువులు, మిత్రులు గ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రామంలో పండగ కళ నెలకొంది.

కనులపండువగా సిరిమానోత్సవం..

గరుగుబిల్లి: రేగాలమ్మతల్లి పండగలో భాగంగా మండలంలోని దళాయివలస గ్రామంలో సిరిమానోత్సవం మంగళవారం కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి సిరిమానోత్సవ శోభను చూసి, తరించారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహ అనుపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.నారాయణమ్మ, ఎంపీటీసీ బి.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

140 మంది పోలీసులతో బందోబస్తు..

వీరఘట్టం: పట్టణంలో నిర్వహిస్తున్న పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పాలకొండ సీఐ మురళీధర్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ సమావేశమై, పలు సూచనలు చేశారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లోని ఉత్సవాల్లో 9వ తేదీన జరిగే సిరిమానోత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారని, ఈ నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా దాదాపు 140 మంది పోలీసులతో పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు.



వీరఘట్టం: ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ మురళీధర్

5న వాహనాల వేలం

సీతంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 5వ తేదీన వాహనాల వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ ఎ.నీలకంఠరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు రెండు ఆటోలకు నిర్వహించే ఈ వేలంలో ఔత్సాహికులు పాల్గొని, వాహనాలను సొంతం చేసుకోవాలని కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' పనులపై సమీక్ష

భామిని: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, మండల ప్రత్యేకాహ్వానితుడు తోట సింహాచలం, ఇతర అధికారులతో గుర్తించిన పనులు, మంజూరైన పనులు, నిధుల మంజూరు, పూర్తయిన పనులపై చర్చించారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మడపాన కేశవ, లోతుగెడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ

వీరఘట్టం: పేద, మధ్య తరగతి వారికి ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యంను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వలంటీర్లు, ఆపరేటర్లతో సమావేశమైన ఆయన రేషన్‌కు బదులు డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆ ఫిర్యాదులు నిజమని రుజువైతే వలంటీర్లు, ఆపరేటర్లను తొలగిస్తామన్నారు.

'జట్టు' సేవలు మరింత విస్తృతం చేయాలి

గరుగుబిల్లి: జట్టు స్వచ్ఛంద సంస్థ సేవలను మరింత విస్తృతం చేయాలని ఏపీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు, జట్టు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎం.ప్రసాదరావు అన్నారు. మండలంలోని తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అధ్యక్షతన 94వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ మంగళవారం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు తమ సంస్థ నిరంతరం సలహాలు, సూచనలు చేస్తోందన్నారు. జట్టు ట్రస్టు ఏర్పాటు చేసి 25 ఏళ్లు గడిచిన నేపథ్యంలో రజతోత్సవం చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ స్టేట్ ఫైనాన్స్ మేనేజర్ సుధానారాయణన్, ట్రస్టీలు ఎం.సుశీల, పి.రవికుమార్, టి.రత్నాకర్, ఎన్.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ లలిత



పార్వతీపురంలోని ఆస్పత్రిలో వృద్ధురాలికి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ సింహాచలం

గరుగుబిల్లి: అనారోగ్యం రీత్యా విజయనగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పట్నాయుని మాణిక్యానికి మండలంలోని రావివలసకు చెందిన వలంటీర్ మర్రాపు లలిత మంగళవారం పెన్షన్ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి మరీ వలంటీర్ పెన్షన్ ఇవ్వడాన్ని అందరూ అభినందిస్తున్నారు. అలాగే పార్వతీపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోడి అక్కమ్మకు పెద్దూరు వలంటీర్ టి.సింహాచలం ఆస్పత్రికి వెళ్లి మరీ పెన్షన్ అందజేశారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

జియ్యమ్మవలస: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని పార్టీ నాయకులు తాడేల మన్మధనాయుడు, తిరుపతినాయుడు, రామకృష్ణ అన్నారు. మండలంలోని పరజపాడు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భూముల రీసర్వేతో సమస్యలకు చెక్..

గరుగుబిల్లి: భూముల రీసర్వేతో రైతుల మధ్య నెలకొన్న భూ సమస్యలకు చెక్ పడుతుందని ఆర్‌డీఓ హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించిన ఆమె రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇలా చేస్తే ఇంకెప్పుడూ రైతుల మధ్య భూ తగాదాలు రావన్నారు. సర్వే పూర్తయిన వెంటనే హద్దురాళ్ల ఏర్పాటు కూడా జరగాలన్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ పి.ఎల్.కుమార్, సర్వేయర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీతారాంపురంలో హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్‌డీఓ హేమలత

గడప గడపకూ 'సంక్షేమ' ఫలాలు



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతీ గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జి.గుమ్మడ, గుమ్మడకాలనీల్లో పర్యటించిన ఆమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు చేకూరేలా ప్రభుత్వం పథకాలు అందిస్తోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న అహర్నిశలు శ్రమిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్ ప్రధాని తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు సద్వినియోగం చేసుకోండి

జియ్యమ్మవలస: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ సేవలు సద్వినియోగం చేసుకోవాలని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రభుతేజ కోరారు. మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో మంగళవారం ఈ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, సుగర్, ఈసీజీ, థైరాయిడ్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి 14 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు కూడా అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రకాష్, సురేష్, ఏఎన్‌ఎం అనసూయ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, సూచనలిస్తున్న వైద్యుడు ప్రభుతేజ

రెండు పూటలా పనులు చేయాలి

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిబద్ర పంచాయతీ పరిధిలోని కొంకడివరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.పైడితల్లి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్దేశిత కొలతల్లో సక్రమంగా పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో మాత్రమే పనులు చేయాలన్నారు. వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు.



వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

కొమరాడ: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ అని వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు అన్నారు. మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో గొబ్బూరు ప్రవీణ్‌కుమార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఎస్‌ఐ జగదీష్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సెల్‌ఫోన్లకు బానిసలైన యువత క్రీడలపై తక్కువగా మక్కువ కనబరుస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ క్రీడలపై ఆసక్తి కనబరచాలని, క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఆటల పోటీల్లో బాగా రాణించిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నత స్థానంలో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కొల్లు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ శరత్ బాబు, ఎస్‌ఐ జగదీష్

4న ఉచిత నేత్రవైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామంలో ఉన్న షిర్డీసాయి ధ్యాన మందిరంలో ఈ నెల 4వ తేదీన ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. జిల్లా అంధత్వ నివారణ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో చేపట్టే ఈ శిబిరానికి అందరూ హాజరై, సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేంకటేశ్వరాలయాన్ని సందర్శించండి

భామిని: సీతంపేటలో కొత్తగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరాలయాన్ని ప్రతిఒక్కరూ సందర్శించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. మండలంలోని నేరడి-బి గ్రామంలో సర్పంచ్ జగదాంబతో కలిసి మాట్లాడిన ఆమె ఈ నెల 4వ తేదీన ప్రతిష్ఠాపనోత్సం జరుగుతుందని, ఆ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరుకానున్నారన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామంలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. వరుణ్‌కుమార్ వర్ధంతి సందర్భంగా నిర్వహించే ఈ పోటీలను ఎంపీపీ కుంబురుక దీనమయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, మాజీ ఎంపీటీసీ కృష్ణ, సర్పంచ్ టి.తులసమ్మ కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులంతా స్నేహపూరిత వాతావరణంలో చక్కగా ఆడి, క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకుని, ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అప్పలస్వామి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు